సాక్షి నిర్మల్

మంగళవారం। 11 । జూలై। 2023



ప్రభం'జనం' ఆపుదాం..

నానాటికి పెరుగుతున్న జనాభా.. తద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

8లో▸



అధ్వాన రోడ్లతో అవస్థలు 9లో▸

లోకేశ్వరం మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లు కంకర తేలి, గుంతలు పడి అధ్వానంగా మారాయి. దీంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.5 /25.4

ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో సాయంత్రం అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పార్క్‌ను అందంగా తీర్చిదిద్దాలి



పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

కడెం: సంపద వనాన్ని అందంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కడెం ప్రాజెక్ట్ దిగువన కుడి కాలువ పక్కన నాలుగు ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న సంపద వనం పనులను సోమవారం పరిశీలించారు. పార్కులో పండ్లు, పూల మొక్కలు నాటాలని, మధ్యలో ఫౌంటేన్, చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ దత్తత గ్రామమైన కొలాంగూడలో పర్యటించారు. కిచెన్ గార్డెన్‌లో భాగంగా నాటిన కూరగాయల మొక్కలను పరిశీలించారు. ప్రతీ ఇంటింటికి కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. కలెక్టర్ వెంట డీఆర్డీవో విజయలక్ష్మి, తహసీల్దార్ చిన్నయ్య, ఎంపీవో ఉపేందర్, ఏపీవో జయదేవ్ తదితరులు ఉన్నారు.

12 నుంచి సంకల్పరథయాత్ర



పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

కడెం: సీపీఎస్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఆగస్టు 12న హైదరాబాద్‌లో ప్రారంభించే సంకల్ప రథయాత్రకు సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు తరలిరావాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావ్ కోరారు. మండల కేంద్రంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సంకల్ప రథయాత్ర పోస్టర్లను సోమవారం విడుదల చేశారు. సీపీఎస్ రద్దయ్యే వరకు ఉద్యోగులంతా ఏకతాటిపై ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భుక్య రాజేశ్‌నాయక్, సీపీఎస్ అధ్యక్షుడు కృష్ణారావు, రాజేశ్వర్, సాయికిరణ్, తదితరులు ఉన్నారు.

12న స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీలు

నిర్మల్‌టౌన్: హకీంపేట్, ఆదిలాబాద్, కరీంనగర్ స్పోర్ట్స్ స్కూళ్లలో 4 ,5వ తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 12న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి క్రాంతికుమార్ తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన 40 మంది విద్యార్థులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలు ఈనెల 25న నిర్వహిస్తారని తెలిపారు. పోటీల్లో స్టాండింగ్ బ్రాడ్ జంప్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, 800 మీటర్స్ రన్, 1కేజీ మెడిసిన్ బాల్ పుట్, వర్టికల్ జంప్, 30 మీటర్ ఫ్లైయింగ్ స్టార్ట్, 6X10 షటిల్ రన్ పోటీలు ఉంటాయని వివరించారు. ఆసక్తి గల విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో ఎన్టీఆర్ మినీ స్టేడియంకు ఉదయం 9 గంటల కు హాజరు కావాలని సూచించారు.

పంచాయతీ కార్మికుల ధర్నా..



మల్టీపర్పస్ వర్కర్స్‌గా తాము చేస్తున్న పనికి.. జీవో 60 ప్రకారం రూ.26 వేల వేతనం చెల్లించాలని రెండు రోజులుగా సమ్మె చేస్తున్న పంచాయతీ కార్మికులు సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. నిర్మల్ డిగ్రీ కళాశాల నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా చేరుకున్నారు. కలెక్టరేట్ ఎదుట బైఠాయించి నినాదాలు చేశారు. సమ్మె విరమించాలని ఎంపీడీవోలు, సర్పంచులు బెదిరిస్తున్నారని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ ఆరోపించారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ రాంబాబుకు అందించారు. పీఎఫ్, ఈఎస్‌ఐ పెన్షన్, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. – నిర్మల్‌చైన్‌గేట్

అంగన్‌వాడీల ఆందోళన..



ఐసీడీఎస్‌కు ముప్పుగా మారనున్న నూతన విద్యాచట్టం 2020ని రద్దు చేయాలని సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ సంఘం జిల్లా కార్యదర్శి లలిత, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బొమ్మెన సురేశ్ మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు, పెన్షన్, ఈఎస్‌ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. 2018లో కేంద్రం పెంచిన వేతనాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎరియర్స్‌తో చెల్లించాలని కోరారు. మదర్స్ కమిటీలకు చైర్‌పర్సన్లుగా తల్లులను మాత్రమే నియమించాలన్నారు. జీవో 14, 19, 8ను సవరించి, అంగన్‌వాడీ ఉద్యోగులకు ఆసరా, కళ్యాణలక్ష్మి తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు. – నిర్మల్‌చైన్‌గేట్

నకిలీ ఎరువులకు చెక్!

- దేశమంతా ఒకే రంగు సంచుల్లో..
- కంపెనీలు వేరైనా కలర్ ఒకటే..
- ఈ సీజన్ నుంచే అమలు
- బస్తాపై ధర, సబ్సిడీ ముద్రణ



పసుపు రంగులో యూరియా బస్తా

డీఏపీ బస్తాపై వివరాల ముద్రణ

నిర్మల్‌చైన్‌గేట్: నకిలీ ఎరువులకు చెక్ పెట్టేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. రైతులకు నాణ్యమైన ఎరువులు ఇవ్వాలన్న లక్ష్యంతో దేశ వ్యాప్తంగా అన్ని కంపెనీల ఎరువులు ఒకే రంగు బస్తాల్లో ఇవ్వాలని నిర్ణయించింది. ఈమేరకు ఆదేశాలు జారీ చేసింది. దీంతో రైతులను మోసం చేసే దళారులకు కళ్లెం పడుతుందని కేంద్రం భావిస్తోంది. ప్రధాన మంత్రి భారతీయ జన ఉర్వారక్ పరియోజన పథకంలో భాగంగా భారత్ డీఏపీ, భారత్ యూరియా, భారత్ కాంప్లెక్స్ ఎరువులను ఈ ఏడాది నుంచి ఎంపిక చేసిన రంగు బస్తాల్లోనే విక్రయించనున్నారు. యూరియా బస్తాలన్నీ ఒక రంగులో, డీఏపీ బస్తాలన్నీ ఒక రంగులో, కాంప్లెక్స్ ఎరువులు మరో రంగులో వస్తున్నాయి. ఏ కంపెనీకి చెందిన ఎరువైనా బస్తా రంగు ఒకేలా ఉండేలా కేంద్రం చర్యలు తీసుకుంది. ఇకపై ఎరువులను విక్రయించే కంపెనీలు ప్రభుత్వం సూచించిన రంగు బస్తాలనే వినియోగించాల్సి ఉంటుంది. ఒక రకం ఎరువు ఒకే రంగు బస్తా ఉండేలా ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది.

కృత్రిమ కొరతకు కళ్లెం..

గతంలో ఎరువుల కంపెనీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్నాయని.. డిమాండ్ ఉన్న ఎరువులను బ్లాక్ చేసి కృత్రిమ కొరత సృష్టిస్తున్నాయని ఫిర్యాదులు వచ్చాయి. దీంతో విచారణ జరిపిన కేంద్రం రైతులకు నష్టం జరుగకుండా చర్యలు చేపట్టింది. ఎరువుల కృత్రిమ కొరతకు కళ్లెం వేసేలా బస్తా రంగులు మార్చడంతోపాటు బస్తాపై కేంద్రం ఇచ్చే రాయితీ తెలిసేలా వివరాలు ముద్రించాలని ఆదేశించింది.

పైభాగంలో ధర.. సబ్సిడీ

కేంద్రం అమలు చేస్తున్న నూతన విధానంలో కంపెనీతో సంబంధం లేకుండా అన్ని కంపెనీలు ఒక రకమైన ఎరువును ఒకే నాణ్యతతో ఒకేరంగు బస్తాలో సరఫరా చేస్తున్నాయి. బస్తా పైభాగంలోనే కంపెనీ ధర ప్రభుత్వం ఇస్తున్న రాయితీ వివరాలు పెద్ద అక్షరాలతో ముద్రిస్తున్నారు. కంపెనీల పేర్లు గుర్తులను చిన్న అక్షరాలతో బస్తా కింది భాగంలో ముద్రిస్తున్నారు. బస్తా మధ్యలో ప్రధాన మంత్రి భారతీయ జన ఉర్వారక్ పరియోజన అని రాసి ఉంటుంది. ఇప్పటికే ఈ బస్తాలు మార్కెట్‌లోకి వచ్చాయి. ఈ చర్యలతో ఎరువుల విక్రయంలో పారదర్శకత వస్తుందో.. లేదో చూడాలి.

రైతుల్లో భిన్నాభిప్రాయాలు లేకుండా..

కంపెనీ ఏదైనా ఎరువులన్నీ ఒకే విధంగా ఉంటాయని రైతులకు నమ్మకం కలిగించేందుకు ప్రభుత్వం బస్తా నమూనా మార్చింది. 2022 ఫెర్టిలైజర్ రాయితీ పథకంలో ప్రభుత్వం నుంచి రాయితీలు పొందే కంపెనీలు నిర్ణీత విధానంలోనే (ఏక రూపం) ఎరువుల బస్తాలు ఉండాలని ఆదేశించారు. ఇందుకు అనుగుణంగా కంపెనీల పేరును బస్తాకు కేటాయించిన కింది భాగంలోనే రాయాలని సూచించింది. గతంలో ఎరువుల బస్తాపై కంపెనీల పేరునే ఆకర్షణీయంగా, ప్రధానంగా ముద్రించేవారు. అప్పటి బస్తాలతో పోలిస్తే ప్రస్తుతం ఎరువుల డీలర్లకు వచ్చిన బస్తాల రూపురేఖలు మారిపోయి కనిపిస్తున్నాయి. అప్పట్లో రైతులు వినియోగించే కంపెనీ ఎరువుల డిమాండ్‌ను బట్టి వ్యాపారులు కొరత సృష్టించి అధిక ధరకు అమ్మిన సందర్భాలు ఉన్నాయి.

ఈ వానాకాలం నుంచే..



రైతులు ఎరువుల కొనుగోళ్ల విషయంలో మోసపోకుండా ఉండాలని ఎరువుల బస్తాలు ఒకే రంగు నిర్ణయించారు. ఈ వానాకాలం నుంచే అందుబాటులోకి వచ్చాయి. ఇకపై ఎరువులను కంపెనీ పేరు చెప్పి అధిక ధరకు విక్రయించడానికి వీలుండదు. బస్తాలపై ధరతోపాటు ప్రభుత్వ రాయితీ కూడా ముద్రించి ఉంటుంది.

– నాగరాజు, మండల వ్యవసాయ అధికారి

పోడు పట్టాలు.. డబుల్ ఇళ్ల..

- ప్రజావాణి దరఖాస్తుల్లో ఇవే ఎక్కువ
- స్వీకరించిన కలెక్టర్ వరుణ్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వరుణ్ రెడ్డి

నిర్మల్‌చైన్‌గేట్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి పోడు భూములకు పట్టాలు, డబుల్ బెడ్రూం ఇళ్ల మంజూరు, పింఛన్లు, నివాస స్థలాలకు భూమి కేటాయింపునకు సంబంధించిన దరఖాస్తులే అధికంగా వచ్చాయి. వివిధ సమస్యలపై 32 దరఖాస్తులు రాగా, పోడు భూముల కోసం వంద దరఖాస్తులు వచ్చాయి. అర్జీలను కలెక్టర్ వరుణ్ రెడ్డి, అదనపు కలెక్టర్ రాంబాబు స్వీకరించారు. పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించగా.. మిగిలిన వాటిని సంబంధిత అధికారులకు పంపించారు.

డబుల్‌బెడ్‌రూం ఇల్లు మంజూరు చేయండి..

నేను బీద కుటుంబానికి చెందిన దానిని. ప్రస్తుతం మహాలక్ష్మివాడలో ఏర్పాటుచేసిన డబల్ బెడ్‌రూం ఇళ్ల సమీపంలో చిన్న గుడిసెలో ఉంటున్నాను. సీసాలు, అట్టలు ఏరుకుని జీవనం కొనసాగిస్తున్నాను. డబుల్ బెడ్‌రూం ఇంటి కోసం దరఖాస్తు పెట్టుకున్న. నాకు ఓ ఇల్లు మంజూరు చేయండి.

– జ్యోతి, మహాలక్ష్మికాలనీ

నిలిచిన పాలు, పప్పు



అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలు

- అంగన్‌వాడీ కేంద్రాల్లో నిండుకుంటున్న పౌష్టికాహారం నిల్వలు
- ఇబ్బంది పడుతున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతలు

ముధోల్: జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలకు పాలు, పప్పుల సరఫరా సక్రమంగా జరగడం లేదు. దీంతో పౌష్టికాహారం నిల్వలు నిండుకున్నాయి. రెండు మూడు నెలలుగా పలు కేంద్రాలకు పప్పు, పాలు సరఫరా కావడం లేదు. మాతా, శిశు మరణాలను గణనీయంగా తగ్గించి, సంపూర్ణ ఆరోగ్య సమాజానికి ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. కానీ అధికారుల నిర్లక్ష్యంతో ఆశించిన ఫలితం రావడం లేదు. క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు పప్పు, పాలు అందడం లేదు.

కానరాని కమిటీలు..

గతంలో జిల్లాస్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా పలువురు ఉన్నతాధికారులతో కమిటీలు ఉండేవి. అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన సరుకుల కొనుగోలు, సరఫరా ప్రక్రియ సాఫీగా జరిగేలా ఈ కమిటీలు పర్యవేక్షించేవి. కొన్నేళ్లుగా హైదరాబాద్ నుంచే పర్యవేక్షణ, టెండర్ల ఖరారు, సరుకుల సరఫరా జరుగుతోంది.

ఐసీడీఎస్ పరిధిలో...

జిల్లా వ్యాప్తంగా 926 సెంటర్లలో 4 ప్రాజెక్టులు, 37 సెక్టార్ల పరిధిలో మెయిన్ అంగన్‌వాడీ సెంటర్లు 816, మినీ అంగన్‌వాడీ సెంటర్లు 110 ఉన్నాయి. వీటి పరిధిలో 6,681 మంది గర్భిణులు, 5,838 మంది బాలింతలు, 62,013 మంది చిన్నారులు ఉన్నారు. ఆరోగ్యలక్ష్మి పథకం కింద గర్భిణులు, బాలింతలకు రోజూ మధ్యాహ్నం భోజనంలో 30 గ్రాములు, కేంద్రాలకు వచ్చే చిన్నారులకు 15 గ్రాముల చొప్పున పప్పు వినియోగిస్తారు. గర్భిణులు, బాలింతలకు రోజు 200 మి.లీ పాలు ఇవ్వాలి.

ప్రత్యామ్నాయ చర్యలేవి....?

అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే టెట్రా పాలు ఆరు నెలల పాటు నిల్వ ఉంటాయి. అయినా మండల వ్యాప్తంగా గడిచిన రెండు, మూడు నెలలుగా సరఫరా సక్రమంగా జరగట్లేదు. పాలు నిల్వ ఉన్న అతికొద్ది కేంద్రాల్లో మాత్రమే సక్రమంగా లబ్ధిదారులకు అందుతున్నాయి. పాల సరఫరాకు రాష్ట్ర స్థాయిలోనే టెండర్ల ఖరారు, సరఫరాను పర్యవేక్షిస్తున్నారు. జిల్లాస్థాయిలో సక్రమ సరఫరాకు చర్యలు చేపట్టడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

ముగిసిన టెండర్ గడువు..

పప్పుల సరఫరాకు గతంలో పిలిచిన రాష్ట్ర వ్యాప్త టెండర్ల గడువు ముగిసింది. కొత్త టెండర్లను ఖరారు చేయడంలో జాప్యమవుతోంది. అప్పటి వరకు సరుకుల సరఫరాలో జాప్యం జరుగకూడదని, ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్రస్థాయి అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలున్నాయి. కానీ ఇప్పటి వరకు జిల్లాలో అలాంటి ఏర్పాట్లు చేయలేదు.

పాలు ఇవ్వడం లేదు..



కొన్ని రోజులుగా అంగన్‌వాడీ సెంటర్లలో పాలు ఇవ్వడం లేదు. ప్రతీరోజు అంగన్‌వాడీ సెంటర్‌కు వచ్చి మధ్యాహ్నం భోజనం చేసి వెళ్తున్నాం. పాలు అడిగితే రావడం లేదని చెబుతున్నారు. అధికారులు పాలు సరఫరా చేయాలి.

– సంధ్యారాణి, గర్భిణీ, తరోడా

త్వరలో సరఫరా..



అంగన్‌వాడీ కేంద్రాలకు పౌష్టికాహారంతోపాటు పాలు, పప్పు త్వరలో సక్రమంగా సరఫరా అయ్యే విధంగా చూస్తాం. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకుంటాం.

– విజయలక్ష్మి, డీఆర్డీవో పీడీ

సర్కారు బడి.. చదువుల గుడి!

- పేద విద్యార్థులకు వరంలా... మస్కాపూర్ జెడ్పీఎస్
- ఉత్తమంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు
- పోటీ పరీక్షల్లో ఈ పాఠశాల విద్యార్థుల సత్తా
- ఎన్ఎంఎంఎస్‌లో 18 మంది ఎంపిక
- తాజాగా ట్రిపుల్ ఐటీకి 8 మంది..



మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

ఖానాపూర్: విద్యార్థుల విద్యా ఆకాంక్షకు ప్రేరణగా నిలుస్తోంది ఖానాపూర్ మండలం మస్కాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల. విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేస్తున్నారు. ప్రత్యేక ప్రణాళిక అమలుచేస్తున్నారు. ఫలితంగా ఏటా ప్రభుత్వం నిర్వహించే పలు పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ కనబరుస్తూ రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధిస్తున్నారు. ఇటీవల జాతీయ ఉపకార వేతనానికి పాఠశాలకు చెందిన 18 మంది విద్యార్థులు ఎంపిక కాగా, తాజాగా బాసర ట్రిపుల్ ఐటీలో పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు సీట్లు సాధించారు. ఉత్తమ బోధన.. ఉత్తమ విద్యార్థులకు నిలయంగా నిలుస్తున్న మస్కాపూర్ పాఠశాలపై ప్రత్యేక కథనం..

జాతీయ ఉపకార వేతనాలకు..

విద్యార్థుల్లో దాగిఉన్న అంతర్గత నైపుణ్యాలను వెలికితీస్తూ పోటీతత్వం పెంచడంతోపాటు వారిని ప్రోత్సహించాలనే సదాశయంతో కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో ఏటా జాతీయ మాధ్యమిక ప్రతిభ ఉపకార వేతన పరీక్ష నిర్వహిస్తుంది. ఈ పరీక్షలో ప్రతిభ కనబరిచిన వారిని నాలుగేళ్లు ఉపకారవేతనానికి ఎంపిక చేసి ఏటా రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందిస్తోంది. ఈ విద్యాసంవత్సరం నిర్వహించిన పరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 31,807 మంది విద్యార్థులు హాజరుకాగా, 2,716 మంది ఎంపిక య్యారు. మస్కాపూర్ పాఠశాల నుంచి 18 మంది విద్యార్థులు ఉపకార వేతనాలకు అర్హత సాధించారు. వీరికి నాలుగేళ్లపాటు ఏడాదికి రూ.12 వేల చొప్పున స్కాలర్‌షిప్ అందుతుంది.

ఏటా ఎంపిక..

మస్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ఏటా జాతీయ మాధ్యమిక ప్రతిభ ఉపకార వేతన పరీక్ష రాస్తున్నారు. ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో ఏటా స్కాలర్‌షిప్‌కు అర్హత సాధిస్తున్నారు. 2018 నుంచి 2020 వరకు మస్కాపూర్ పాఠశాల నుంచే 75 మంది ఎంపికయ్యారు. 2020–21 విద్యా సంవత్సరం మస్కాపూర్ నుంచి 25 మంది ఎంపికయి రాష్ట్రంలోనే పాఠశాల మొదటిస్థానంలో నిలిచింది. 2022–23లో 17 మంది ఎంపికయ్యారు. ఉమ్మడి జిల్లాలో మొదటి స్థానం, రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచింది. ఈ ఏడు సైతం 18 మంది ఎంపికయి రాష్ట్రంలో రెండోస్థానంలో, నిర్మల్ జిల్లాలో మొదటి స్థానంలో పాఠశాల నిలిచింది. హెచ్‌ఎం బాలాజీ, గైడ్ టీచర్ జాడి శ్రీనివాస్, పీఈటీ రమేశ్, పలువురు ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవతో విద్యార్థులు పరీక్షల్లో రాణిస్తున్నారని తల్లి దండ్రులు పేర్కొంటున్నారు.

ట్రిపుల్ ఐటీకి 8 మంది..

బాసర ట్రిపుల్ ఐటీలో 2023–24 విద్యాసంవత్సరానికి ఈ ఏడాది మస్కాపూర్ పాఠశాల నుంచి 8 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. కుంటాల పాఠశాల నుంచి 17 మంది ఎంపికయ్యారు. జిల్లా నుంచి ఈఏడాది అత్యధికంగా 94 మంది బాసర ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. పదో తరగతి ఫలితాల్లోనూ నిర్మల్ జిల్లా గత విద్యాసంవత్సరం రాష్ట్రంలోనే మొదటి స్థానం సాధించింది.

ఉపాధ్యాయుల ప్రత్యేక చొరవతో



మాది నిరుపేద కుటుంబం ఎన్ఎంఎంఎస్ పరీక్షలో ఎంపికైతే నాలుగేళ్లపాటు ఏటా ఉపకార వేతనం వస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. వారే ప్రత్యేక చొరవతో తమను పరీక్షలకు సన్నద్ధం చేశారు. ఇలా ఎంపిక కావడం వల్ల తమ కుటుంబానికి కొంత మేర ఖర్చులు మిగిల్చగలిగాను. – యోగేశ్, విద్యార్థి

పోటీ పరీక్షల్లో రాణించొచ్చు



జాతీయ ఉపకార వేతనానికి ఎంపిక కావడం ద్వారా విద్యార్థుల్లో పోటీ తత్వం పెరుగుతుంది. పైచదువులు కూడా కష్టపడి చదివే అవకాశం ఉంటుంది. పెరిగిన ఖర్చుల దృష్ట్యా విద్యార్థుల అభ్యసన సామగ్రికి ఉపకారం వేతనం తోడ్పడుతుంది. విద్యార్థుల్లో సృజనాత్మకతతోపాటు భవిష్యత్తులోను పోటీ పరీక్షల్లో రాణిస్తారు. జాడి శ్రీనివాస్, గైడ్ టీచర్.

సమష్టి కృషితో ఉత్తమ ఫలితాలు



ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎన్ఎంఎంఎస్ ఫలితాల్లో పాఠశాల నుంచి 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. తద్వారా పాఠశాల రాష్ట్రంలో రెండోస్థానం, జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఉపాధ్యాయులు, విద్యార్థుల సమష్టి కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారు. తాజాగా ట్రిపుల్ ఐటిలో మా పాఠశాల నుంచి 8 మంది సీట్లు సాధించారు. పాఠశాల అభివృద్ధికి గ్రామస్తులు సహకారం అందిస్తున్నారు.

బాలాజీ, హెచ్‌ఎం మస్కాపూర్, జెడ్పీఎస్ఎస్

కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు





కిషన్‌రెడ్డి, ఈటలతో మోహన్‌రావుపటేల్, రామారావుపటేల్

భైంసాటౌన్: కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు బండి సంజయ్‌ను ముధోల్ నియోజకవర్గ నేతలు సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. నూతనంగా నియామకమైన నేతలను సన్మానించారు. అనంతరం నియోజకవర్గ సమస్యలు, పార్టీ పరిస్థితిపై చర్చించారు. ఈ సందర్భంగా వారు వచ్చే ఎన్నికల్లో ముధోల్‌లో బీజేపీ జెండా ఎగిరేలా కృషి చేయాలని సూచించారు. నేతలను కలిసినవారిలో పవార్ రామారావుపటేల్, భోస్లే మోహన్‌రావు పటేల్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు సౌకర్యం కల్పించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

సిరికొండ: గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే రేఖానాయక్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియాను కలిసి వినతిపత్రం అందజేశారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయనను కలిసి రోడ్లు లేక గ్రామీణ ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, మంజూరైన రోడ్లకు వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు బషీర్, విఠల్ పటేల్, చెండే బాలాజీ ఉన్నారు.

ఆలయాల్లో చోరీ

పెంబి: మండలంలోని పోచంపల్లి, పోచంపాడు గ్రామాల్లో ఉన్న జగదాంబ దేవి ఆలయాల్లో శనివారం రాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయ తాళం పగులగొట్టి అమ్మవారి ఆభరణాలు ఎత్తుకెళ్లినట్లు ఎస్సై రజినీకాంత్ తెలిపారు. బంగారం విలువ రూ.12వేలు, వెండి విలువ రూ.6వేలు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో జైలుశిక్ష

సోన్: మండలంలోని గంజాల్ టోల్ ప్లాజా వద్ద ఇటీవల మద్యం సేవించి వాహనం నడిపిన వ్యక్తికి కోర్టు మూడు రోజుల జైలుశిక్ష విధించింది. ఇటీవల గంజాల్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు నిర్వహించిన తనిఖీలో కడెం మండలానికి చెందిన బసుకుంట రాజు మద్యం సేవించి వాహనం నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. సోమవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ అతనికి మూడు రోజులు జైలుశిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

ప్రమాదానికి కారణమైన లారీ పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: రోడ్డు ప్రమాదానికి కారణమైన లారీని పట్టుకున్నట్లు ఎస్పీ ఉదయ్‌కుమార్ రెడ్డి తెలిపారు. శనివారం తెల్లవారుజామున గుడిహత్నూర్ మండలం మేకలగండి వద్ద ఆటోను వెనుకనుంచి ఢీకొట్టడంతో నలుగురు మృతి చెందారు. రెండు రోజులుగా సీసీ కెమెరాల ద్వారా క్షుణ్ణంగా పరిశీలించిన పోలీసులు ప్రమాదానికి కారణమైన లారీని మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో పట్టుకున్నారు. జిల్లా పోలీసులు లారీని స్వాధీనం చేసుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను మంగళవారం వెల్లడించనున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు.

ఆవులు తరలిస్తున్న ఇద్దరిపై కేసు

ఆదిలాబాద్‌రూరల్: మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ పట్టణంలోని స్లాటర్ హౌజ్ (కబేళ)కు ఆవులు తరలిస్తున్న ఇద్దరిపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగనాథ్ తెలిపారు. బేల మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు ఆరు ఆవులను స్లాటర్ హౌజ్‌కు తరలిస్తుండగా యాపల్‌గూడ ప్రాంతంలో వాహనాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఆవులను స్వాధీనం చేసుకోవడంతో పాటు వాహనాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

గుడుంబా పట్టివేత

బోథ్: మండలంలోని ధన్నూర్ (బి)లో సోమవారం గుడుంబా విక్రయిస్తూ ఓ మహిళ పట్టుబడినట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామంలో దాడులు నిర్వహించగా పవార్ కమల అనే మహిళ గుడుంబా విక్రయిస్తుండగా పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. మహిళపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

చోరీ కేసులో నిందితుల అరెస్టు

భైంసాటౌన్(ముథోల్): పట్టణంలోని పురాణ బజార్‌లో గల ఓ కిరాణ దుకాణంలో చోరీకి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ ఎల్.శ్రీను సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8న రాత్రి గుర్తుతెలియని దుండగులు దుకాణంలోకి ప్రవేశించి రూ.40వేలు అపహరించినట్లు పాంగ్రిగల్లికి చెందిన అబ్దుల్ ఇర్ఫాన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపగా సీసీ ఫుటేజీల ఆధారంగా పాంగ్రిగల్లికి చెందిన షేక్ అద్నాన్, సయ్యద్ సోహెబ్, షేక్ మెహ్రాజ్, సయ్యద్ సల్మాన్, షేక్ సల్మాన్‌లను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.38,600 స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

ప్రభంజనం ఆపుదాం..

- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం



'దేవుడా ఓ మంచి దేవుడా.. మాకు తినడానికి తిండినిచ్చావు.. ఇలాగే దేశంలోని తొంభై కోట్ల మందికి ఇవ్వాలి.. ప్రపంచంలోని.. నాకు నంబర్ సరిగ్గా తెలియదు.. ఎంత ఉంటే అంత మందికి ఇలాగే ఇవ్వాలని కోరుకుంటున్నా'.. అని ఓ సినిమాలో హీరో ప్రార్థిస్తాడు. అది హాస్యాన్ని పంచినా మరి నేడు అందరికీ ఆహారం అందించడం, అందరి అవసరాలు తీర్చడం, అందరికీ ఉపాధి కల్పించడం సాధ్యమవుతుందా? అంటే ఆలోచించాల్సిందే. నానాటికి పెరుగుతున్న జనాభా.. తద్వారా తలెత్తే దుష్పరిణామాలను ప్రజలకు వివరించేందుకు, వారికి ఆయా సమస్యలపై అవగాహన కలిగించేందుకు ఏటా జూలై 11న ప్రపంచ జనాభా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1987లో ప్రపంచ జనాభా ఐదు బిలియన్లకు చేరుకున్న రోజు జూలై 11. కాబట్టి ఆరోజును 'ప్రపంచ జనాభా దినం'గా ఐక్యరాజ్యసమితి గుర్తించింది.

- తగ్గితేనే నీరా'జనం'...
- మితిమీరితే అనర్థమే...
- వనరుల కొరతకు మూలం...
- రోజురోజుకూ పెరుగుతున్న జనాభా

ఉమ్మడి జిల్లా వివరాలు

జిల్లా	మొత్తం జనాభా	జిల్లా వైశాల్యం (చ.కి.మీ.లు)	జనసాంద్రత (కిమీ.కు)
నిర్మల్	7,09,418	3,731.35	190
ఆదిలాబాద్	7,08,972	3,971.31	179
మంచిర్యాల	8,07,037	3,908.04	207
కుమురంభీం	5,15,812	4,491.28	115



నిర్మల్ ఖిల్లా: 'ఇంతింతై వటుడింతై' అన్న చందంగా నానాటికీ పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్లుగా ప్రకృతి వనరులు తరిగిపోతున్నా వాటిని పొదుపుగా వాడుకునేందుకు ఎవరూ ప్రయత్నించడం లేదు. కాబట్టి ప్రకృతి వనరుల ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పర్యావరణాన్ని కాపాడుకునేలా చేయాలి. అలాగే.. జనాభా పెరుగుదల వల్ల కలిగే నష్టాలు, నిరక్షరాస్యత, భూమిపై స్థలం సరిపోకపోవడం.. లాంటి సమస్యలను ప్రభుత్వాలు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపర్చాలి. ఈ విషయాలపై వారికి క్షుణ్ణంగా అవగాహన కల్పించి, స్వచ్ఛందంగా కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకునేలా ప్రోత్సహించాలి. ఈ రకంగా ఎవరికివారు జనాభా నియంత్రణకు పూనుకున్నట్లయితే భారాన్ని కాస్తయినా తగ్గించినవారం అవుతాం.

చైనాను దాటేసిన భారత్....

ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా భారత్ నిలిచింది. చాలా కాలంగా మొదటి స్థానంలో కొనసాగుతున్న చైనాను అధిగమించింది. అయితే ఈ రెండు దేశాల మధ్య అంతరాయం చాలా తక్కువే కావడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్‌లో విడుదల చేసిన ఐక్యరాజ్య సమితి అంచనా నివేదిక ప్రకారం చైనాలో 142.5 కోట్ల జనాభా ఉంటే భారతదేశంలో ప్రస్తుతం 142.8 కోట్ల జనాభా ఉంది. అంటే చైనా కంటే ఇండియా జనాభా దాదాపు మూడు మిలియన్లు ఎక్కువ. భూభాగం పరంగా చైనా పరిధి విశాలంగా ఉండగా భారతదేశం పరిధి చైనాకంటే తక్కువగా ఉంది.

మితిమీరితే ఏర్పడే సమస్యలు ఇవే

జనాభా పెరుగులతో ప్రకృతి సమతుల్యం దెబ్బతింటుంది. అడవులు అంతరించిపోతాయి. జనాభాకు అనుగుణంగా అవసరాలు కూడా తీర్చాలి. దీంతో తరాల మధ్య అంతరాలు పెరుగుతాయి. ఆకలికేకలు, ఆరోగ్యం ఇబ్బందులు పెడతాయి. జనాభా పెరుగుదలను అడ్డుకుంటేనే మనుగడ సాధ్యం. లేదంటే సమస్యలే నిత్యం స్వాగతం చెబుతాయి. వనరులు సైతం తరిగిపోతున్నాయి. అవసరాలకు మించి వాడటంతో సమస్యలే ఎదురవుతాయని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నియంత్రిస్తేనే మనుగడ



పరిమిత వనరులున్న భారతదేశంలో జనాభాను నియంత్రించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ బాధ్యతను ప్రభుత్వాలే కాదు ప్రజలు స్వీయ ఆచరణలో పెడితే జనాభా పెరుగుదలను నియంత్రించవచ్చు. ప్రస్తుతం ఉన్న పరిమిత వనరులను భావితరాలకు అందించవచ్చు.

– పీజీ రెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, నిర్మల్

సమస్యలు పరిష్కరించాలని వినతి



సమస్యలు విన్నవిస్తున్న ఎమ్మెల్యే రేఖానాయక్

పెంబి: నియోజవర్గంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ ఆదివారం హైదరాబాద్‌లో ట్రైబల్ వెల్ఫేర్ కమిషనర్ క్రిష్టియాన చొగోత్, పంచాయతీ రాజ్ చీఫ్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాలను కలిశారు. పెంబి మండలంలోని పస్పుల వంతెన నిర్మాణం, కడెం మండలంలోని గంగాపూర్ వంతెన నిర్మాణ పనులు చేపట్టాలని, ట్రైబల్ వెల్ఫేర్ నుండి మంజూరైన రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు.

చెత్త సేకరణలో సర్పంచ్, ఉప సర్పంచ్



చెత్త సేకరిస్తున్న సర్పంచ్, ఉప సర్పంచ్

ఉట్నూర్‌రూరల్: తమ డిమాండ్లు నెరవేర్చాలని గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టగా చేసేదేంలేక సోమవారం సర్పంచ్, ఉప సర్పంచ్ కార్మికులుగా మారారు. మండలంలోని శ్యాంపూర్‌లోని కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతో ఉపసర్పంచ్ కేశవ్ ట్రాక్టర్ నడుపుతుండగా సర్పంచ్ మల్లిక ఇంటింట చెత్త సేకరించారు.

నేడు అభ్యర్థులకు కౌన్సెలింగ్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో గుర్తించిన పోస్టుల భర్తీకి కాంట్రాక్టు పద్ధతిన పనిచేయడానికి 2019 నవంబర్ 6న నిర్వహించిన రాతపరీక్షలో ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 11న కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈవో యాదయ్య తెలిపారు. పోస్టుల భర్తీకి తుది జాబితాను సోమవారం డీఈవో కార్యాలయం నోటీసు బోర్డుపై ప్రదర్శించినట్లు తెలిపారు.

తుడుందెబ్బ కమిటీల్లో మార్పులు



మాట్లాడుతున్న కొడప నగేష్

ఆదిలాబాద్‌రూరల్: ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) జిల్లా కమిటీల్లో మార్పులు చేస్తూ రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు జల్కే పాండురంగ్, కార్యదర్శి కొడప నగేష్, ఉపాధ్యక్షుడు దుర్వ నగేష్ తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర కమిటీతో ఎలాంటి సంప్రదింపులు చేయకుండా బుర్స పోచ్చయ్య, మైపతి అరుణ్‌కుమార్, గోడం గణేశ్, పుర్క బాపురావ్ తుడుందెబ్బ ప్రతిపాదిత ఎమ్మెల్యే అభ్యర్థులుగా ప్రకటించుకోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఇకపై వారికి తుడుందెబ్బ కమిటీతో ఎలాంటి సంబంధం లేదన్నారు. ఇదే విషయంపై ఈ నెల 23న హైదరాబాద్‌లో రాష్ట్ర కమిటీ సమావేశం కానున్నట్లు తెలిపారు. సమావేశంలో కొలాం సేవా సంఘం నాయకుడు కొడప సోనేరావ్, తుడుందెబ్బ నాయకులు సిడాం పురుషోత్తం, సిడాం లక్ష్మీకాంత్, గోండ్వానా గణతంత్ర పార్టీ జిల్లా అధ్యక్షుడు తుంరం చందన్ షావ్, వెట్టి దేవిదాస్, సెడ్మకి ఆనంద్‌రావ్, తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దు ప్రాంతాల్లో పటిష్టమైన నిఘా

- ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి



లక్ష్మీపూర్ చెక్ పోస్టును తనిఖీ చేస్తున్న ఎస్పీ

తలమడుగు(బోథ్): తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టుల వద్ద పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్, లక్ష్మీపూర్ సమీపంలోని చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ సరిహద్దు ప్రాంతంలో సంచరించే వాహనాలను సీసీ కెమెరాల నిఘాలో పర్యవేక్షిస్తూ ఉండాలని సూచించారు. అనంతరం తలమడుగు పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలన్నారు. లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ, సైదారావు, తలమడుగు ఎస్సై జి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

దాడి కేసులో వ్యక్తి రిమాండ్

కుభీర్(ముథోల్): మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన పోతుగంటి శివకుమార్‌పై ఇటీవల నిగ్వా బస్టాండ్ వద్ద కర్రతో దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన తపస్కర్ రవిని సోమవారం అరెస్టు చేసినట్లు ఎస్సై ఎండీ షరీఫ్ తెలిపారు. బాధితుని తల్లి పోతుగంటి లక్ష్మీబాయి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్టు చేసి భైంసా మున్సిఫ్ జడ్జి రవిబాబు ఎదుట హాజరు పర్చగా మెజిస్ట్రేట్ 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ...

నేరడిగొండ(బోథ్): ఆరోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వడూర్‌కు చెందిన బొడిగ గంగయ్య (36) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండడంతో ఆస్పత్రుల ఖర్చుల నిమిత్తం రూ.6లక్షల వరకు అప్పులపాలయ్యాడు. దీంతో అప్పు ఎలా తీర్చాలో తెలియక తరచూ భార్య చినలక్ష్మితో చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈ నెల 4 న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. సోమవారం సాయంత్రం బోథ్ ఎక్స్ రోడ్ సమీపంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై సాయన్న సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టమ్ నిమిత్తం బోథ్ ఆస్పత్రికి తరలించారు.

భర్త వేధింపులు తాళలేక ..

లోకేశ్వరం(ముథోల్): భర్త వేధింపులు తాళలేక భార్య ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మన్మద్ గ్రామానికి చెందిన మిర్యాల రుక్మాబాయి(45) భర్త మిర్యాల సుదర్శన్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం మద్యం సేవించి ఇంటికి వచ్చి భార్యను మానసికంగా, శారీరకంగా వేధించేవాడు. దీంతో మనస్తాపం చెందిన మహిళ ఆదివారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి సోదరుడు టేకు గంగారాం ఫిర్యాదు మేరకు సుదర్శన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య

మంచిర్యాలక్రైం: పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. సీఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్‌కు చెందిన ఇంగం శ్రీనివాస్ (40) మెడికల్ ఏజెన్సీ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించడంతో ఫోన్ కాల్ ఆధారంగా లాడ్జీలోకి వెళ్లి పరిశీలించగా పురుగుల మందు తాగి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతునికి భార్య మీన, కుమారుడు మల్లిక్ సాయి ఉన్నారు. కాగా మృతికి గల కారణాలు తెలియరాలేదు.

సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్



సమస్యలు వింటున్న పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్(ఖానాపూర్): గిరిజనుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. కెరమెరి మండలం రాంపూర్‌కు చెందిన కోట్నాక్ విజయ్ దివ్యాంగుల పింఛన్ మంజూరు చేయాలని, తమ గ్రామానికి రోడ్డు మంజూరు చేయాలని గుడిహత్నూర్ మండలం న్యూసోమర్‌పేట్ గ్రామస్తులు, దస్తురాబాద్ మండలం మున్యాల్‌కు చెందిన భుక్యా వంశీ తనకు స్వయం ఉపాధికోసం ఆర్థికసాయం అందించాలని, ఆర్‌వోఎఫ్ఆర్ హక్కు పత్రాలు మంజూరు చేయాలని నెన్నెల మండలం దమ్మిరెడ్డి గ్రామస్తులు కోరారు. ఇవేకాకుండా ఇంకా పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లు, ఆశ్రమ పాఠశాలల్లో ప్రవేశాలు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలు స్వీకరించిన పీవో సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శిక్షణ సహాయ కలెక్టర్ పి.శ్రీజ, డీడీ దిలీప్‌కుమార్, ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుడ్మ బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ ఆత్రం భాస్కర్, పీహెచ్‌వో సందీప్, జేడీఎం నాగభూషణం, ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జిల్లాస్థాయి పోస్టర్ తయారీ పోటీలు

నిర్మల్ రూరల్: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు జిల్లా స్థాయి పోస్టర్ తయారీ పోటీలు నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని సోమవార్‌పేట్ బాలికల ఉన్నత పాఠశాలలో ఉదయం 10.30 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే ఇందులో పాల్గొనాలి సూచించారు. మండలానికి ముగ్గురు చొప్పున పాల్గొని, అధికారులు ఇచ్చిన అంశంపై పోస్టర్లు తయారు చేయాలని తెలిపారు. పోటీల అనంతరం విజేతలను ప్రకటిస్తామని, మొదటి బహుమతిగా రూ.500 రెండో బహుమతిగా రూ.300 మూడో బహుమతిగా రూ.200 అందజేస్తామన్నారు. పోస్టర్ తయారీకి సంబంధించిన సామాగ్రి విద్యార్థులే తెచ్చుకోవాలని సూచించారు.

బైక్ అదుపు తప్పి ఇద్దరికి గాయాలు



గాయాలపాలైన భీమయ్య

పెంబి: మండల కేంద్రానికి చెందిన భీమయ్య, ఎల్లయ్య సోమవారం పెంబి నుంచి పెంబితాండలో ఉన్న బంధువుల ఇంటికి బైక్‌పై బయలుదేరారు. పెంబితాండ సమీపంలో సైకిల్‌ను తప్పించబోయి బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. ఇద్దరికి గాయాలు కావడంతో గమనించిన స్థానికులు పెంబి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కొరకు నిర్మల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

హత్యాయత్నం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: హత్యాయత్నం కేసులో నిర్మల్ న్యాయస్థానం ఒకరికి ఐదేళ్ల జైలు, జరిమానా విధించినట్లు కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ తెలిపారు. భైంసాకు చెందిన పల్సి సునీల్, పల్సి రజినీకాంత్ అన్నదమ్ముల కుమారులు. ఇద్దరి మధ్య భూతగాదాలు ఉన్నాయి. 15 అక్టోబర్ 2021న సునీల్ తన ఇంటిముందు నిలబడి ఉండగా రజినీకాంత్ వచ్చి భూతులు తిట్టాడు. రాయితో కొట్టడంతో గాయాలయ్యాయి. దీంతో బాధితుడు భైంసా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సైలు ప్రదీప్, విక్రమ్ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు చేయడంతో రజినీకాంత్‌కు ఐదేళ్ల జైలుశిక్షతో పాటు, రూ.2,200 జరిమానా విధిస్తూ నిర్మల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కె.అజేశ్ కుమార్ సోమవారం తీర్పు నిచ్చారు.

క్రీడా పాఠశాలల్లో ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న డీఈఓ ప్రణీత

ఆదిలాబాద్: క్రీడా పాఠశాలల్లో ప్రవేశం పొందితే ఉజ్వలమైన భవిష్యత్ ఉంటుందని జిల్లా యువజన క్రీడల అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సోమవారం నిర్వహించిన తెలంగాణ క్రీడా పాఠశాల జిల్లా స్థాయి ఎంపిక పోటీలను డీఈవో ప్రణీతతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన చిన్నారులు హకీంపేటలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని వెల్లడించారు. అక్కడ ప్రతిభ కనబరిచిన వారికి క్రీడా పాఠశాలలో ప్రవేశాలు లభిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ స్వామి, జిల్లా అథ్లెటిక్స్ కార్యదర్శి రాజేశ్, వ్యాయామ ఉపాధ్యాయులు హరిచరణ్, నాందేవ్, అశ్వత్ రెడ్డి జయశ్రీ, కబీర్దాస్, రాజు, తదితరులు పాల్గొన్నారు.